క్లుప్తంగా

నేడు లక్ష్మీతిరుపతమ్మ తల్లి తిరునాళ్ల

క్రోసూరు: మండలంలోని 88 త్యాళ్లూరు గ్రామంలో శనివారం శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి తిరునాళ్ల మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ శుక్రవారం తెలిపింది. భక్తులు అశేషంగా పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో నిదానంపాటి లక్ష్మీ అమ్మవారి వార్షిక మహోత్సవం



అచ్చంపేట: స్థానిక సీతారామపురంలోని నిదానంపాటి లక్ష్మీ అమ్మవారు, గణపతి, ఆంజనేయ, నాగేంద్రస్వామి వార్ల ప్రథమ వార్షిక మహోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పెద్ది చిన్న యల్లమందరావు ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవాలు గత రెండు రోజులుగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం నిత్య విధి మండప దేవత పూజలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేద పండితుల వేద మంత్రోచ్ఛారణల మధ్య అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, గో ప్రతిష్ఠలు జరిగాయి. అనంతరం ధేను దర్శనం, రుద్ర హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవారి కుంకుమ బండితో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు.

ఏరియా వైద్యశాల ప్రాంగణంలో అన్నసంతర్పణ



సత్తెనపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రాంగణంలో జనసేన పార్టీ నాయకుడు అప్పాపురపు నరేంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం అన్నసంతర్పణ నిర్వహించారు. పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ గాత్రం కుముదిని, కోటేశ్వరరావు దంపతుల సహకారంతో 120 మందికి అన్న సంతర్పణ నిర్వహించారు. ఒక్కొక్కరికి భోజనంతో పాటు రెండు కోడిగుడ్లను అందించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ అప్పికట్ల ప్రవీణ్, డాక్టర్ సుజాత, డాక్టర్ అనూష, డాక్టర్ జీవన్ జ్యోతి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, నాయకులు పులిపాటి శ్రీరామమూర్తి, కట్టమూరి అప్పారావు, దివ్వెల శ్రీనివాసరావు, బొక్కా సంగీతరావు, గంజి వీరాస్వామి, సూరేరామ కోటేశ్వరరావు, కుంచనపల్లి శ్రీనివాసరావు, పరిమి విశ్వేశ్వరరావు, కట్టా శంకరరావు, కాగితాల గోపాలకృష్ణ, అప్పాపురపు సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ బల్లల వితరణ



పెదకూరపాడు: తాగునీటి చెరువు కట్టపై ఉదయం, సాయంత్రం వేళల్లో నడకకు వచ్చే వాకర్స్ విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా మాజీ సర్పంచ్ అర్తిమళ్ల నళిని స్మారకార్థం ఆమె భర్త పెదకూరపాడు మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ల రమేష్ సొంత నిధులతో 10 సిమెంట్ బల్లలు సమకూర్చారు. శుక్రవారం నడక మార్గంలోని పలు ప్రదేశాల్లో వాటిని ఏర్పాటు చేశారు. చెరువు కట్టపై నడక మార్గం అభివృద్ధికి కృషి చేసి మౌలిక వసతులు కల్పిస్తున్న రమేష్‌కు వాకర్స్ కృతజ్ఞతలు తెలిపారు.

మండలంలో 5 పరీక్ష కేంద్రాలు



క్రోసూరు: మండలంలో పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఎంఈవో-2 గణేష్ శుక్రవారం తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు ఐదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మండలంలో ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల విద్యార్థులు మొత్తం 878 మంది పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. ఇందులో బాలురు 427, బాలికలు 451 మంది ఉన్నట్లు తెలిపారు. క్రోసూరులో మూడు పరీక్ష కేంద్రాలు క్రోసూరు జెడ్పీ, ఏపీ మోడల్ స్కూల్, జై భారత్ పబ్లిక్ స్కూల్, అదేవిధంగా ఊటుకూరు జెడ్పీ పాఠశాల, దొడ్లేరు జెడ్పీ పాఠశాలలను కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

వ్యక్తి అదృశ్యం

గురజాల రూరల్: వ్యక్తి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని తేలుకుట్ల గ్రామానికి చెందిన లోకసాని శివారెడ్డి ఈ నెల 10వ తేదీన గురజాలకని బయటకు వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ రోజు రాత్రి రాకపోవడంతో బంధువుల ఇళ్లకు ఏమైనా వెళ్లాడా అని కుటుంబసభ్యులు వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో సమాచారం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

సేవలు నిల్.. సర్వేలు ఫుల్

- అదనపు బాధ్యతలతో సిబ్బంది ఇబ్బందులు
- సచివాలయాల్లో సేవలకు స్వస్తి పలికిన కూటమి సర్కార్
- అవసరాలకు మండల కేంద్రానికి పరుగులు



తాళ్లచెరువులోని సచివాలయం

అచ్చంపేట: జాతిపిత గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ప్రజలకు కావలసిన సేవలను గ్రామాలలోనే అందించే వారు. అందుకు గాను సిబ్బందిని నియమించారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు ఆ సేవలకు స్వస్తి పలకడమే కాకుండా, సచివాలయ సిబ్బందిపై వివిధ రకాల సర్వేల పేరుతో, సెలవులు కూడా లేకుండా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో 17 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ప్రతి ప్రభుత్వ శాఖకు ఒక ఉద్యోగి చొప్పున 11 మందిని నియమించారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సమన్వయంతో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందించే వారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అందుకు భిన్నంగా జరుగుతోంది. మండల కేంద్రాలకు పరుగు తీయాల్సిన దుస్థితి ఏర్పడింది.

ఒత్తిడికి గురవుతున్నారు

గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రస్తుత విధులతో పాటు మరో 15 రకాల సర్వేలను నిర్వహించవలసి ఉంది. సెలవు రోజుతో సంబంధం లేకుండా సర్వేలు చేయాలని ఆదేశించడం, టార్గెట్లు పెట్టడం, మాతృ శాఖ పనులు, బీఎల్‌ఓ విధులు, ఇలా అన్ని రకాల పనులను చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలతో సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. సర్వేల కోసం సిబ్బంది మొత్తం గ్రామాలలో తిరగడంతో సచివాలయాలు వెలవెల బోతున్నాయి.

- పబ్లిక్, ప్రైవేటు, పీపుల్ భాగస్వామ్యంతో వచ్చే ఉగాది నుంచి పీ 4 అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టనుంది. అందుకు సంబంధించి సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి తిరిగి సర్వే చేయవలసి ఉంది.
- వర్క్ ఫ్రమ్ హోమ్ పేరుతో 18 నుంచి 50 ఏళ్లలోపు వారి జాబితాలు తయారు చేయాలి.
- మహిళా పోలీసులు చిల్డ్రన్స్ విథౌట్ ఆధార్ సర్వే నిర్వహించాల్సి ఉంది. పుట్టిన పిల్లలకు బర్త్ సర్టిఫికెట్స్, ఆధార్ నమోదు వంటివి నిర్వర్తించాలి.
- హౌస్ మ్యాపింగ్ ప్రకారం సర్వే పూర్తి చేసిన తరువాత ఓటీపీ చెప్పమని అడిగితే వారు నిరాకరిస్తున్నారని, తాము పడిన శ్రమ అంతా వృధా అవుతోందని సిబ్బంది వాపోతున్నారు.

కూటమి సానుభూతిపరులకే

గతంలో కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అందిన ప్రభుత్వ పథకాలు ఇప్పుడు కూటమి కనుసన్నల్లో మంజూరు అవుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నారు. ఉపాధి హామీ నిధులతో సబ్సిడీపై ఇస్తున్న పశుగ్రాసం యూనిట్లు, కార్పొరేషన్ రుణాలు ఇలా ప్రతి పథకంలో కూటమి సానుభూతిపరులనే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్కరికి కూడా రేషన్ కార్డు గానీ, కొత్త పెన్షన్ గానీ, ఇంటి స్థలం గానీ వచ్చిన దాఖలాలు లేవు. కార్డులు ఎప్పుడిస్తారు, కొత్తపెన్షన్లు ఎప్పుడొస్తాయో సచివాలయ సిబ్బంది వద్ద సమాధానం లేదు.

పరుగులు తప్పడం లేదు



గతంలో ఏ చిన్న అవసరం వచ్చినా మండల కేంద్రాలకు పరుగు పెట్టాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామ సచివాలయాల ద్వారా గ్రామంలోనే అన్ని సేవలు అందేవి. ఇప్పుడు సచివాలయాలకు వెళితే సిబ్బంది సర్వేల పేరుతో తిరుగుతుండంతో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. మళ్లీ మండల కేంద్రాలకు పరుగులు తప్పడం లేదు.

– దేవరశెట్టి శ్రీనివాసరావు, వ్యాపారస్తుడు, మాదిపాడు

సిబ్బంది తగ్గిపోయారు



గత ప్రభుత్వంలో గ్రామ సచివాలయంలో అన్ని వివరాలు తెలిసేవి. అవసరమైన సేవలు అందేవి. కావలసిన పత్రాల కోసం దరఖాస్తులు ఇచ్చేవారం. కానీ ఇప్పుడు ఆ పరిస్థితులు పోయాయి. సచివాలయాలలో సగానికి సగం సిబ్బంది తగ్గిపోయారు, ఉన్న సిబ్బంది సర్వేల పేరుతో తిరుగుతున్నారు.

– అనుముల సాంబిరెడ్డి, రైతు, రుద్రవరం

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ప్రశ్న పత్రాలు



సత్తెనపల్లి: పదో తరగతి పరీక్షలు ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ప్రశ్న పత్రాలు శుక్రవారం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాయి. ఇప్పటికే ఒక సెట్ రాగా రెండవ సెట్ ప్రస్తుతం వచ్చాయి. వీటిని డివిజన్ పరిధిలోని 14 మండలాల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పోలీస్ స్టేషన్‌లలో భద్రపరిచారు. 10వ తరగతి పరీక్షకు సంబంధించి సత్తెనపల్లి డివిజన్‌లో 14 మండలాల పరిధిలో 60 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 13,104 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశామని అధికారులు తెలిపారు.

పరీక్ష కిట్టు అందజేత

బెల్లంకొండ: మండలంలోని పాపాయపాలెం గ్రామంలోని బీసీ హాస్టల్లో ఉంటూ స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యులు పింగళి గోవర్ధన్ రెడ్డి పరీక్ష కిట్లను అందజేశారు. హాస్టల్లో ఉన్న 15 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, పెన్నులు అందజేశారు. పాఠశాల సిబ్బంది ప్రసాదు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు ఆపాలి

సీఐటీయూ జిల్లా నాయకులు జి.రవిబాబు



డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

క్రోసూరు: స్కీం వర్కర్లు చిరుద్యోగులైన అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, వీవోఏ తదితర వారిపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా నాయకులు జి.రవిబాబు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం రాజకీయ వేధింపులు అపాలని స్థానిక డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన ప్రతి సందర్భంలో చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు జరపడం అన్యాయమని అన్నారు. ఎవరు అధికారంలోకి వచ్చినా చిరుద్యోగులను వేధించడం దుర్మార్గమని, రాజకీయ వేధింపుల వలన అమరావతి మండలం ఉంగుటూరు గ్రామంలో ఆశ వర్కర్ రాయపాటి సామ్రాజ్యం ఆత్మహత్యాయత్నం, అదేవిధంగా నకరికల్లు మండలం పాపిశెట్టిపాలెనికి చెందిన అంగన్‌వాడీ వర్కర్ ఆత్మహత్య చేసుకోవడం జరిగిందని వీటికి కారణం ఆయా శాఖల అధికారులు రాజకీయ వేధింపులకు పాల్పడే వారికి అనుకూలంగా వ్యవహరించడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ నాయకులు బి.జయలక్ష్మి, జి.శివపార్వతి, శ్యామల, కౌలు రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు తిమ్మిశెట్టి హనుమంతరావు, ఏపూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ మాస ప్రార్థనలు



క్రోసూరు మసీదులో ప్రత్యేక నమాజులో ముస్లింలు

క్రోసూరు: పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని మండలంలోని అన్ని మసీదులు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. రంజాన్ మాసం రెండవ శుక్రవారం ప్రార్థనలకు భక్తులు అశేషంగా పాల్గొన్నారు. క్రోసూరు మండలంలో 15 మసీదులుండగా అన్ని మసీదులలో ప్రత్యేక నమాజులు, తరావీ ప్రార్థనలు జరిగాయి. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేపట్టేందుకు ముస్లింలు వేకువజామున సహరి(ఉపవాస దీక్ష మొదలు పెట్టటం) సాయంత్రం ఇఫ్తేహార్ (ఉపవాసం ముగించటం) చేస్తారు. ఈ మాసంలో ఐదు పూటల నమాజులుతో పాటు రాత్రి పూట ప్రత్యేక ప్రార్థనలు (తరావీ నమాజులు) చేయాలని దివ్యఖురాన్ ఆదేశించినట్లు మత పెద్దలు తెలుపుతున్నారు. అదేవిధంగా రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం దాన ధర్మాలు విరివిగా చేయాలని, అబద్ధాలు ఆడటం, తగాదాలు, ఇతరులను దూషించటం, నిందలు వేయటం చేయకూడదు. అదేవిధంగా జకాత్ (కొంత మేర ధనం పేదలకు పంచటం), ఫిత్రా (కుటుంబంలోని వ్యక్తి పేర తోటి నిరుపేదలకు దానం చేయటం) ప్రతి ముస్లిం విధిగా ఆచరించాలని ఖురాన్ చెబుతుంది. రంజాన్ మాసం అంతా ముస్లింలు నమాజులు ఆచరిస్తూ, భక్తి మార్గం ఆచరించాలని ఖురాన్ తెలుపుతుంది.

నకరికల్లు: పవిత్ర రంజాన్ మాసం రెండో శుక్రవారం మండలంలోని మసీదులన్నీ కిక్కిరిసాయి. రంజాన్ మాసం పురస్కరించుకొని ఉపవాస దీక్షాపరులతో పాటు ప్రత్యేకంగా నమాజులో పాల్గొనేందుకు వచ్చిన ముస్లిం సోదరులతో మసీదులు కిటకిటలాడాయి. మండలంలోని నకరికల్లు, గుండ్లపల్లి, కుంకలగుంట, చాగల్లు, చేజర్ల, చల్లగుండ్ల, చీమలమర్రి తదితర గ్రామాల్లోని మసీదుల్లో భక్తిశ్రద్ధలతో నమాజును జరుపుకున్నారు. శుక్రవారం రోజును ముస్లింలు పండుగ కన్నా ఎక్కువగా జరుపుకుంటారు. రంజాన్ మాసంలో వచ్చే నాలుగు శుక్రవారాల్లో రెండో శుక్రవారం ప్రార్థనలు విశేషంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని మసీదుల్లో మత పెద్దలు మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాసదీక్ష పాటిస్తే అల్లాహ్ ప్రసన్నం పొంది పరలోక ప్రాప్తి సిద్ధిస్తుందని అన్నారు. ఉపవాసంతో పాటు దానధర్మాలు, సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం ప్రపంచ శాంతి కోసం దువా చేశారు.

సంస్మరణ సభను జయప్రదం చేయండి

అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్మాలపాటి



మాట్లాడుతున్న కొమ్మాలపాటి

పెదకూరపాడు: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శత వార్షికోత్సవాల్లో భాగంగా ఈ నెల 16న పెదకూరపాడులో జరిగే అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్మాలపాటి శరత్‌చంద్ర జ్యోతిశ్రీ కోరారు. పెదకూరపాడులోని సీపీఐ, అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్‌చంద్ర జ్యోతిశ్రీ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పెదకూరపాడు ప్రాంతంలో విశిష్ట సేవలు అందించిన మాజీ శాసనసభ్యులు కామ్రేడ్ దర్శి లక్షయ్య, కామ్రేడ్ అంబటి హనుమంతురావు, కామ్రేడ్ దర్శి పానకాలరావు, కామ్రేడ్ డాక్టర్ పఠాన్ హుస్సేన్‌ఖాన్, కామ్రేడ్ తురకా చిన్నప్ప, కామ్రేడ్ షేక్ నాగూల్‌మీరా, కామ్రేడ్ కొమ్మాలపాటి అప్పారావు, కామ్రేడ్ యెరుకూరి వెంకట అప్పారావు, కామ్రేడ్ దర్శి వెంకట్రావు, కామ్రేడ్ మునిపల్లి ప్రభాకర్, కామ్రేడ్ షేక్ షంషుద్దీన్‌లను స్మరించుకుంటూ ఈ సభను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు, పల్నాడు జిల్లా కార్యదరి మారుతీ వరప్రసాద్, సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, షేక్ హుస్సేన్, బైరవపట్నం రామకృష్ణలతో పాటు ప్రజా నాట్య మండలి బృందం పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొమ్మాలపాటి రమేష్, మునగోటి శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

ఉపవాసంతో ప్రార్థన ఎంతో పవిత్రం



ప్రసంగిస్తున్న పాస్టర్ ప్రేమయ్య

దాచేపల్లి: ఉపవాస ప్రార్థన పరలోక ప్రాప్తిని అనుగ్రహిస్తుందని పాస్టర్ తగరం ప్రేమయ్య అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో శుక్రవారం ఉపవాస ప్రార్థన నిర్వహించారు. దేశం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ ప్రేమయ్య మాట్లాడుతూ.. ఉపవాస ప్రార్థన ఎంతో పవిత్రమైందన్నారు. అనంతరం ఉపవాసం ఉన్న విశ్వాసులు ప్రేమవిందు ఆరగించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు నాగెండ్ల రత్నం, పురుషోత్తం, మాతంగి రాంబాబు, ఆనందరావు, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

నేడు అంకమ్మతల్లి దేవాలయ పునఃనిర్మాణ మహోత్సవం

అచ్చంపేట: మండలంలోని ఓర్వకల్లులో వేంచేసియున్న శిథిలమైన అంకమ్మతల్లి దేవాలయాన్ని గ్రామ పెద్దలు, ఆలయ ధర్మకర్తల సహాయ సహకారాలతో పునర్నిర్మించారు. అందులో అంకమ్మతల్లి విగ్రహాన్ని శనివారం ప్రతిష్ఠించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గత రెండు రోజులుగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం ఆరు గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదానం కార్యక్రమం జరుగనుంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

మాదలలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు



మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు నిర్వహించారు. గ్రామానికి చెందిన బెల్లం మహాలక్ష్మమ్మ అనే మహిళ జ్వరంతో బాధపడుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. మురుగు కాల్వలను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. దోమల నివారణకు ఫాగింగ్, మురుగు కాల్వల్లో ఎబేట్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. గ్రామంలోని అన్ని ఏరియాల్లో ఫాగింగ్ చేపడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి శివాజీ తెలిపారు. రోడ్డు వెంబడి ఉన్న వ్యర్థాలను తొలగించటం జరిగిందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి, రక్త నమూనాలు సేకరించారు. అవసరమైన వారికి మందులను అందించారు.

అన్నదాన సత్రం అధ్యక్షుడిగా అంజిరెడ్డి



రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద నున్న కుంటి మల్లారెడ్డి అఖిల భారత సంక్షేమ రెడ్ల అన్నదాన సత్రం అధ్యక్షుడిగా మిట్టగుడిపాడు గ్రామానికి చెందిన గొట్టం అంజిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మాజీ అధ్యక్షుడు పులి ఓబుల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సత్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యక్షుడిగా గాదె వీరారెడ్డి (కంభంపాడు), కార్యదర్శిగా మందలపు వెంకటరెడ్డి (పాలువాయి), ట్రెజరర్‌గా నెవలి సీతారామిరెడ్డి (మంచికల్లు), సహాయ కార్యదర్శిగా చపారపు విజయ భాస్కర్‌రెడ్డి (రెంటచింతల)లను ఎన్నుకున్నట్లు వెల్లడించారు. ఈ పాలక వర్గం రెండు సంవత్సరాలు కొనసాగుతుందన్నారు.

కోర్కెలు తీర్చే అమ్మ.. గంగమ్మ తల్లి



పొంగళ్లు పొంగిస్తున్న మహిళలు

పెదకూరపాడు: కోర్కెలు తీర్చే అమ్మ ... చల్లగా చూడమ్మా గంగమ్మ తల్లి అంటూ గారపాడు గ్రామం మార్మోగింది. రాష్ట్రం నలుమూల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో గంగమ్మ తల్లి దేవాలయం కిటకిటలాడింది. మండలంలోని గంగమ్మ తల్లి తిరునాళ్ల శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కోర్కెలు తీర్చే తల్లిగా, నమ్మిన భక్తులకు అండగా ఉండే తల్లిగా గంగమ్మ తల్లిని భక్తులు పూజిస్తారు. తెల్లవారుజాము నుంచే వేలాది మంది భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా దేవాలయం వద్దకు వివిధ గ్రామాల భక్తులు ప్రభలతో తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్నదానం చేశారు. భక్తులు, గ్రామస్తులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలు అలరించాయి. ఎస్ఐ గిరిబాబు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారికి స్నపన తిరుమంజనం



సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్‌లో గల అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఫాల్గుణ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని మహాలక్ష్మి అమ్మవారి తిరునక్షత్రం సందర్భంగా లక్ష్మీ అమ్మవారికి శ్రీవారికి స్నపన తిరుమంజనం భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. స్నపన తిరుమంజనంలో కురువేరు, తెల్లపట్టు, రంగురంగుల ఎండు ఫలాలు, వట్టివేరు, పసుపు రోజా మాలలను శ్రీవారికి అలంకరించారు. శ్రీమాన్ శ్రీ చిత్రకవి శ్యాము ఆచార్యులు రామానుజ స్వామి శ్రీ, భూ, పురుష, నీలా, నారాయణ సూక్తాలను పటిస్తుండగా పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో ఉత్సవమూర్తులకు విశేషంగా అభిషేకం చేపట్టారు. సాయంత్రం పురవీధుల్లో 40వ మాస పౌర్ణమి గరుడ వాహన సేవలో శ్రీవారు గరుడ వాహనదారుడై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఏకాంత సేవ కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. ఆలయ ధర్మకర్తలు, శ్రీవారి సేవా సమాజం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆనందంగా హోలీ వేడుకలు



కొత్తసుగాలీ కాలనీలోని హోలీ వేడుకల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు



డీజేలతో నృత్యాలు చేస్తూ హోలీ జరుపుకుంటున్న సుగాలీలు

సత్తెనపల్లి: హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గ వ్యాప్తంగా శుక్రవారం హోలీ వేడుకలు ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా రంగుల నీళ్లు చల్లుకుంటూ సంతోషంగా గడిపారు. పట్టణంలోని 3వ వార్డు కొత్త సుగాలీకాలనీలో మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్ ఆధ్వర్యంలో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంతోష సాగరంలో మునిగితేలారు. అంతేకాక పట్టణంలో రాజస్థానీలు, మరాఠీలు సందడి చేస్తూ రంగులు చల్లుకొని వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఘనంగా సుగాలీల హోలీ

రాజుపాలెం: మండల కేంద్రంలోని బంజారాకు చెందిన సుగాలీలు శుక్రవారం హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. సుగాలీ సంఘం పెద్ద నాయకుడు నూన్సావతు అంజీనాయక్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో సుగాలీ మహిళలు, సంఘ నాయకులు పాటలు పాడుకుంటూ నృత్యాలు చేస్తూ రంగులు చల్లుకుంటూ హోలీని జరుపుకున్నారు. డీజేతో బంజారాకు సంబంధించిన పాటలు పెట్టుకుంటూ కులదైవానికి పూజలు చేశారు. అనంతరం పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో అజ్మీరా భాస్కర్‌నాయక్, భూక్యా ఆంజనేయులునాయక్(బాబు), నూన్సావతు బాలాజీ నాయక్, భూక్యా లక్ష్మానాయక్(ఆర్టీసీ), భూక్యా సుజాతాభాయి, భూక్యా సీతాభాయి, భూక్యా పద్మాభాయి, శిరీషాభాయి, అనసూర్యాభాయి, అలివేలుభాయి, సరస్వతీభాయి, రమణాభాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హోలీ వేడుకలు

బెల్లంకొండ: మండలంలోని గ్రామాల్లో శుక్రవారం హోలీ పండగను ఘనంగా జరుపుకున్నారు. తీన్‌మార్ డప్పుల నడుమ మహిళలు, చిన్నారులు రంగులు చల్లుకుంటూ, యువత డ్యాన్స్‌లు చేశారు. గ్రామాలలో సుగాలీలు రంగులు చల్లుకుని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నృత్యాలు చేసుకుంటూ రంగులు చల్లుకుంటూ సంతోషంగా గడిపారు.

క్రోసూరులో కాలిగ్రఫీ శిక్షణ



కాలిగ్రఫీ శిక్షణలో పాల్గొన్న శిక్షకులు, ఉపాధ్యాయులు

క్రోసూరు: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం బాలమర్రు ఎంపీపీ పాఠశాల హెచ్ఎం టి.శరత్‌కుమార్ ఆధ్వర్యంలో ఉప్పాళ్ల రామోహన్‌రావు స్వచ్ఛంద సంస్థచే 500 మంది ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఇంగ్లీషు చేతిరాత మెరుగు పరచుకోవటానికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. టి.శరత్ కుమార్ ఈ కార్యక్రమ వివరాలు తెలుపుతూ క్రోసూరు, అచ్చంపేట మండలాల్లోని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. శిక్షకులుగా ప్రముఖ కాలిగ్రఫీ నిపుణులు ఉప్పాళ్ల రామ్మోహన్‌రావు, నాగమణి, జగదీష్ బాబు, ప్రియాంక పాల్గొన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన కాలిగ్రఫీ పోటీల్లో ఉత్తమ కాలిగ్రఫీ అవార్డు(గోల్డ్‌మెడల్) ఉపాధ్యాయురాలు గౌతమికి లభించినట్లు తెలిపారు. అదేవిధంగా ఉపాధ్యాయులు పిచ్చయ్యకు సిల్వర్, స్వర్ణలతకు మూడవ బహుమతి లభించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు బోళ్ల నరసింహారెడ్డి, మంచాల మోహన్‌రావు, పిచ్చయ్య, గ్రామ ఉప సర్పంచ్ షేక్ మస్తాన్ సహకారం అందించినట్లు తెలిపారు.